క్లుప్తంగా

గ్రామ వలంటీర్లకు నియామక పత్రాల అందజేత



నియామకపత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ రమణమూర్తి

రణస్థలం: మండలంలోని రణస్థలం-1, జే.ఆర్.పురం-2, అల్లివలస పంచాయతీలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులను భర్తీ చేసినట్లు ఎంపీడీఓ ఆర్.వి రమణమూర్తి తెలిపారు. కొత్తగా నియమితులైన వలంటీర్లకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నియామకపత్రాలను అందజేశారు. వైస్ ఎంపీపీలు రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నింటి లక్ష్మునాయుడు, మింది శ్రీనివాస్ రెడ్డి, బొంతు జగన్, తోటయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



పోతయ్యవలసలో చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

లావేరు: పిల్లలు ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని లావేరు పీహెచ్‌సీ వైద్యుడు మణిభూషణ్ అన్నారు. మండలంలోని 23 సచివాలయాల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం సచివాలయాల ఏఎన్‌ఎంలు చిన్నారులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. పిల్లలు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తల్లులకు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని వైద్యులు పర్యవేక్షించారు. పిల్లలకు వ్యాధులు రాకుండా ఉండటం కోసం ముందుగా టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ విజేతలకు అభినందనలు



విజేతలతో విజిలెన్స్ ఎస్పీ సురేష్‌బాబు

శ్రీకాకుళం క్రైమ్:శ్రీకాకుళం న్యూకాలనీ: కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో ఇటీవల జరిగిన నాలుగో సౌత్ జోన్ పెంకాక్ సిలాట్ చాంపియన్‌షిప్ పోటీల్లో మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ చూపిన శ్రీకాకుళం నారాయణ ఈ-టెక్నో పాఠశాల విద్యార్థులను విజిలెన్సు ఎస్పీ ఎ.సురేష్‌బాబు బుధవారం అభినందించారు. విజిలెన్సు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న ఎల్.మహేశ్వరరావు కుమార్తెలు ఎల్.సుమైరా, ఎల్.దియాధృతి అండర్-12, అండర్-9 కేటగిరీలో టాన్డింగ్, సోలో విభాగాల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలను గెలుచుకున్నారు. దీంతో జిల్లా పెంకాక్ సిలాట్ అసోసియేషన్ అధ్యక్షుడు రేగిడి దయమయ సమక్షంలో పిల్లలను విజిలెన్సు ఎస్పీ తన కార్యాలయంలో సత్కరించారు. కోచ్ నక్క లక్ష్మణ్‌నాయుడు, జూనియర్ కోచ్ ఎం.గౌతమిలను అభినందించారు.

ప్రపంచ శాంతిని కోరుతూ విద్యార్థుల ప్రదర్శన



ప్లకార్డులతో విద్యార్థులు

గార: ప్రపంచ శాంతిని కోరుతూ అంపోలు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం వినూత్న ప్రదర్శన చేపట్టారు. ప్లకార్డులు చేతపట్టి యుద్ధాలు వద్దు-శాంతి ముద్దంటూ నినాదాలు చేశారు. ఇజ్రాయిల్-హమాస్‌ల మధ్య, రష్యా- ఉక్రెయిన్ యుద్ధాలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో హెచ్‌ఎం డి.సుశీల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల సాగర్ కవచ్



కార్యక్రమంలో పోలీసు సిబ్బంది

శ్రీకాకుళం రూరల్: సముద్రమార్గం గుండా చొరబాట్లను నియంత్రించే ప్రక్రియలో భాగంగా ఈ నెల పది, 11 తేదీల్లో మెరైన్ పోలీసులతో కలిసి లోకల్ పోలీసులు సాగర్ కవచ్ నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం తండేవలస ప్రాంతంలో డమ్మీ ఆర్డీఎక్స్‌లను ఉంచి విస్ఫోటనం చెందకముందే వానిటి గుర్తించే విధానంపై శ్రీకాకుళం రూరల్ పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ డి.ప్రసాద్, టౌన్ సీఐ సన్యాసినాయుడు, రూరల్ ఎస్సై విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వాడవాడలా వైద్య శిబిరాలు

- ప్రజారోగ్యమే సీఎం జగన్ ధ్యేయం
- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



జి.సిగడాం: వాండ్రంగిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



లావేరు: పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



గార: మందులను అందజేస్తున్న రామ్‌మనోహర్ నాయుడు



ఎచ్చెర్ల క్యాంపస్: వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



రణస్థలం: పైడిభీమవరంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: ప్రజారోగ్యమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని, దీనికోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కోరారు. వాండ్రంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. తహసీల్దార్ వప్పల వేణుగోపాలరావు, ఎంపీడీఓ కె.నిశ్చల, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, జేసీఎస్ కన్వీనర్ డొల వెంకటరమణ, సర్పంచ్ సాకేటి నాగరాజు, ఎంపీటీసీ సభ్యురాలు బూరాడ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పెదరావుపల్లిలో..

లావేరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెదరావుపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. 270 మందికి వైద్య తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, ఎంపీడీఓ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బడివానిపేటలో..

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామ సచివాలయం యూనిట్‌గా ఇంటింటా సర్వే నిర్వహించి ఆరోగ్య పరీక్షలు చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. బడివానిపేట గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి, ఎస్ఎంపురం పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముద్దాడ శంకరరావు, జేసీఎస్ ఇన్‌చార్జి మూగి శ్రీరాములు, స్థానిక సర్పంచ్ కారి తాతారావు, ఎంపీటీసీ కొమర సమరం, తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పైడిభీమవరంలో..

రణస్థలం: జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. పైడిభీమవరం గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 302 మందికి వైద్య సేవలు అందించారు. 17మందికి ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిఫర్ చేశారు. 79 మందికి కంటి పరీక్షలు చేసి, 36 మందికి కళ్లద్దాలు అందజేశారు. ఇద్దరికి కంటి శస్త్రచికిత్సల నిమిత్తం శ్రీకాకుళం రిఫర్ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ టొంపల సీతారాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, పార్టీ మహిళా అధ్యక్షురాలు గురాన మానస, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

గార: ప్రజారోగ్యంపై వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. శ్రీకూర్మం పంచాయతీ తండ్యాలపేట సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలించారు. నిపుణులైన వైద్యులచే రోగులకు పరీక్షలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఉచితంగా మందులు అందజేయడంతో పాటు అవసరమైన వారికి మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురాం, మండల ప్రత్యేకాధికారి బి.రమణమూర్తి, బరాటం నాగేశ్వరరావు, ఎంపీడీవో సంజీవ రమణయ్య, అందవరపు బాలకృష్ణ, బరాటం శ్రీధర్, ఊట అప్పలనాయుడు వైద్యులు పద్మావతి పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



దుర్గామాత అమ్మవారు



ఆలయానికి రంగులు వేస్తున్న దృశ్యం



ముత్యాలమ్మతల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేస్తున్న భారీ సెట్టింగు

శ్రీకాకుళం కల్చరల్: నాగావళి నది పాత వంతెన దగ్గర వేంచేసి దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు అర్చకులు గంధం దుర్గాప్రసాద్, ధర్మకర్త మచ్చ బుచ్చిబాబు, ఈవో పి.శ్యామలరావులు బుధవారం తెలిపారు. అందుకోసం ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ఆలయానికి రంగులు, విద్యుత్ దీపాలను అలంకరించడంతోపాటు క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉచిత ప్రసాదం, భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 15వ తేదీ మాలధారణలు ఉంటాయన్నారు.

ముత్యాలమ్మతల్లి ఆలయం వద్ద..

ముత్యాలమ్మతల్లి ఆలయం వద్ద కూడా దసరా శరన్నవరాత్రి ఉత్సవాల కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధి గజపతి తెలిపారు. ఆలయం ముందు భారీ సెట్టింగు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తొమ్మిది రోజులు నిర్వహించే ఉత్సవాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ నిర్వహణ పనులు చేపడతామన్నారు. నారువ, వరిశాం, పైడిభీమవరం, సీడీఎల్ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జేకేసీ మెంటార్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ)లో మెంటార్‌గా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.సురేఖ తెలిపారు. ఎమ్మెస్సీ (మాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్స్) లేదా బీటెక్, ఎంటెక్ చదివి కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు తమ బయోడేటా, సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు జేకేసీ కోఆర్డినేటర్ మణికుమార్ (సెల్ నంబర్: 99490 94968)ను సంప్రదించాలని సూచించారు.

సక్రమంగా భూముల రీసర్వే

- ఆర్డీవో బొడ్డేపల్లి శాంతి



గ్రామసభలో ఆర్డీవో శాంతి తదితరులు

శ్రీకాకుళం రూరల్: ఎటువంటి తాగాదాలకు ఆస్కారం లేకుండా రైతులు తమ భూములను రీసర్వే చేయించుకోవాలని ఆర్డీవో బొడ్డేపల్లి శాంతి అన్నారు. సింగుపురం గ్రామంలో రీసర్వే ల్యాండ్‌పై గ్రామసభను ఆర్డీవో అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వేనంబర్ 425లో ఎల్‌సీ ల్యాండ్ 25 ఎకరాలు ఉన్నందున దీనిపై గ్రామస్తులు, రైతులకు ఆభూమి వివరాలను గ్రామసభలో వివరించారు. ఎటువంటి తగాదాలు లేకుండా తమ భూములను రైతులు సర్వే చేయించుకోవాలని సూచించారు. రెవెన్యూ అధికారులచే రీసర్వే, డీఎల్ఆర్ వెరిఫికేషన్ నిర్వహించారు. రైతులు, గ్రామస్తులు చెప్పే అభ్యంతరాలను తహసీల్దార్ ఎస్.వెంకట్రావ్ సమక్షంలో రికార్డుల్లో నమోదు చేశారు. సర్పంచ్ గుండ ఆదిత్యానాయుడు, ఎంపీటీసీ సభ్యులు నక్క శంకర్, బగ్గు అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండ మోహన్ పాల్గొన్నారు.

ప్రజల విన్నపం మేరకే సీసీ రోడ్డు నిర్మాణం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలో కొత్తపేట, బర్మాకాలనీ, బాదుర్లపేట గ్రామ ప్రజల విన్నపం మేరకే కొత్తపేట వద్ద నాగావళి నదికి వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు చల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గెంజి కుటుంబానికి చెందిన స్థలంలోంచి కక్ష పూరితంగా రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారనే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఆయా ప్రాంతవాసులంతా నాగావళి నది తీరానికి స్నానాలు చేసేందుకు వెళ్లేందుకు సరైన మార్గం లేదని, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని మంత్రి ధర్మాన ప్రసాదరావును కోరారన్నారు. దీంతో నగర పాలక సంస్థ అధికారులకు మంత్రి ధర్మాన లేఖ రాసినట్టు పేర్కొన్నారు. ఇందుకోసం పాత శ్రీకాకుళం రూరల్ పరిధిలోని సర్వే నంబర్ 681, 682లో మున్సిపల్ ప్రభుత్వ స్థలంలో నుంచి సీసీ రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు.

విజయగణపతికి దీపారాధన



దీపాలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న విజయగణపతి ఆలయంలో స్వామివారికి అష్టోత్తర శత దీపారాధనలు బుధవారం జరిగాయి. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి భక్తులు దీపాలను వెలిగించారు.

విద్యార్థులకు అభినందన



క్రీడాకారులతో దయామయ, లక్ష్మణ్‌నాయుడు, ఈశ్వర్

శ్రీకాకుళం న్యూకాలనీ: కేరళలో ఇటీవల జరిగిన సౌత్‌జోన్ నేషనల్స్ పెన్కాక్ సిలట్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా పెన్కాక్ సిలట్ అధ్యక్షులు, గ్రాండ్ మాస్టర్ రేగిడి దయామయ అభినందించారు. బుధవారం సాయంత్రం శ్రీకాకుళంలో జరిగిన కార్యక్రమంలో మెడల్స్‌ను ప్రదానం చేసి అభినందించారు. జాతీయ పోటీల్లో ఇదే స్ఫూర్తితో రాణించి పతకాలతో జిల్లాకు పేరుతీసుకురావాలని సూచించారు. కోచ్ నక్క లక్ష్మణ్‌నాయుడు, లింగాల ఈశ్వర్, ఎం.గౌతమి, సీనియర్ కుంగ్ ఫు మాస్టర్ అలికాన రాము పాల్గొన్నారు.

ముగిసిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ సమావేశం



సమావేశంలో సమీక్షిస్తున్న అధికారులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం డీపీటీవో కార్యాలయంలో బుధవారం విజయనగరం జోన్ డిప్యూటీ సీటీఎం ఓఅండ్‌సీ అధ్యక్షతన శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలోని మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లతో నెలవారీ సదస్సును బుధవారం నిర్వహించారు. కష్టమర్లకు మరింత చేరువ అవ్వడానికి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అలాగే వ్యాపార అభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. సమావేశంలో శ్రీకాకుళం ఇన్‌చార్జి డీపీటీవో, ఏటీఎం కమర్షియల్, శ్రీకాకుళం 1, 2 డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక అలంకరణ



పూజలందుకున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: బలగ అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం సందర్భంగా స్వామివారికి క్షీరాభిషేకాలు జరిగాయి. అర్చకులు దేవకొండ శంకరనారాయణ శర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలి

- మంత్రి ధర్మాన ప్రసాదరావు



రోడ్లు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని.. లేకుంటే సహించేది లేదని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలోని న్యూకాలనీలో రూ 1.59 కోట్ల వ్యయంతో 2.3 కిలోమీటర్ల మేర నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమానికి వచ్చినప్పుడు ఇక్కడి సమస్యలు గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలోనే పనులు మొదలు పెట్టేందుకు ఇక్కడికి వచ్చానన్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అలాగే త్వరలోనే కలెక్టరేట్‌ను పూర్తి చేసి పరిపాలన అంతా ఒకే చోట ఉండేందుకు అన్నిచర్యలూ తీసుకుంటున్నట్టు వెల్లడించారు. వైఎస్సార్ హయాంలోనే దీని రూపకల్పనకు సన్నాహాలు చేశామని గుర్తు చేశారు. తాజాగా నిధులు విడుదల కావడంతో పనులు వేగం పుంజుకోనున్నాయని చెప్పారు. నగర పాలక సంస్థ పరిధిలోని రోడ్లు పూర్తి చేసేందుకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, కావలిపాటి రవిశంకర్, జిల్లా అగ్రి బోర్డ్ చైర్మన్ శిమ్మా నేతాజీ, అడ్వకేట్లు పాలిశెట్టి మురళి, వినయ్ భూషణ, కొంక్యనా సుభాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు మండవిల్లి రవి, పొన్నాడ రుషి, న్యూకాలనీ స్థానికులు చక్రవర్తి, లంక గాంధీ, పి.నగేష్, బి.జనార్దన్‌రావు, కె.శ్రీను, కె.సత్యనారాయణ, వి.వేణు, ఏపీ రాము, టి వైకుంఠరావు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న మీసాల వెంకటరమణ

జి.సిగడాం: గ్రామ సచివాలయాల్లో వివిధ శాఖల్లో పని చేస్తున్న సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ అన్నారు. మండలంలోని ఎస్.భీమవరం పంచాయతీలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశ, వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టారని, వీటిలో వివిధ రోగాలతో బాధపడుతున్న రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు సంబంధిత గ్రామ వలంటీర్లు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.నిశ్చల, సర్పంచ్ తొత్తడి రామారావు, ఎంపీటీసీ సభ్యులు సూజాత, గోవిందరావు, నాగవరపు సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



లావేరు: మాట్లాడుతున్న ఎంఈఓ మురళీకృష్ణారావు



రణస్థలం: ఎంఈఓ లావణ్యను సన్మానిస్తున్న ఆదర్శ పాఠశాల సిబ్బంది



జి.సిగడాం: కేజీబీవీలో బాలికా దినోత్సవం

లావేరు: బాలికలు బాగా చదువుకోవాలని ఎంఈఓ మజ్జి మురళీక్రిష్ణారావు అన్నారు. మండలంలోని మురపాక గ్రామంలోని పీటీనగర్ కాలనీలో గల కేజీబీవీలో బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్య ద్వారానే మహిళా సాధికారిత సాధ్యమవుతుందన్నారు. సమాజంలో అసమానతలు తొలగించి మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తే ఉన్నత స్థాయికి చేరుకోగలుగుతారన్నారు. బాలికలు చిన్న వయస్సుల్లో వివాహాలు చేసుకోకుండా బాగా చదువుకోవాలన్నారు. జీఎంఎస్‌కే రజనీ, బ్రెడ్స్ కో ఆర్డినేటర్ తేజశ్రీ, కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో

రణస్థలం: బాలికలు చదువుకుంటే సమాజం అన్నీ రంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తుందని ఎంఈఓ బి.లావణ్య అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. బాలికలు అన్నీ రంగాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ పాట్నూరు శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి..

జి.సిగడాం: బాలికలు అన్ని రంగాల్లోనూ రాణించాలని కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రత్యేకాధికారి డి.ఉషారత్నంకుమారి అన్నారు. స్థానిక కేజీబీవీలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. విద్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు రెడ్‌క్రాస్ సాయం



సాయం అందజేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: కుందువానిపేటకు చెందిన మత్స్యకార కుటుంబాకు అనురాగ నిలయంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు బుధవారం సాయం అందించారు. సముద్రవేటకు వెళ్లి చనిపోయిన ఎనిమిది కుటుంబ సభ్యులకు సాయం చేయమని సర్పంచ్ సూరాడ సూర్యం, మత్స్యకార సంఘం అధ్యక్షుడు కోనాడ నరసింగరావులు కోరిన మీదట వారికి చీరలు, హైజీన్, కిచిన్ కిట్లు అందజేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు పాల్గొన్నారు.